క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు తొలగించే పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ లత

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించే పనులు శనివారం చేపట్టామని కౌన్సిలర్ లత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సిబ్బందితో ఆయా పనులు ప్రారంభించామని చెప్పారు. పిచ్చి మొక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున, దోమలు సైతం ఎక్కువ అవుతున్నందున వాటిని తొలగిస్తామన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్లలో ప్రసిద్ధి చెందిన శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందోహం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సత్యనారాయణ స్వామి మండపంలో దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు. సీతారామ చంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటవార్పు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

క్షీరాభిషేకం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో, కాళ్లకల్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరిగి 200 యూనిట్లు వినియోగించే వారికి జీరో కరెంట్ బిల్లును అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన చౌరస్తాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు గోపాల్, నర్సింగరావు, నర్సింహచారి, సత్యనారాయణ, నర్సింహ, వెంకటేష్, ఫకూర్, అశోక్, శోభన్‌రాజ్, జి.రామచంద్రం, వెంకటేష్, నాగరాజు, కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మల్లేశ్, యూత్ నాయకులు పోచయ్య, రంగాచారి, సర్వీన్‌గౌడ్, రమేశ్, మహేశ్, శేఖర్, రాజు తదితరులున్నారు.

'రైతుల పక్షాన నిలిచే వారికే మా మద్దతు'

వెల్దుర్తి(తూప్రాన్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రైతుల పక్షాన నిలిచే పార్టీలకే తాము మద్దతు ప్రకటిస్తామని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రం వెల్దుర్తిలో రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల ప్రధాన సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీనిచ్చిన పార్టీ అభ్యర్థులనే ఎంపీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఆయా పార్టీలు ప్రణాళికలు రూపొందించి మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వెంకటేశం, చిన్నింగి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ కాలుష్యంతో సమస్యలు



పరిశ్రమ యాజమాన్యానికి వినతిపత్రం అందిస్తున్న జీడిపల్లి యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): నిత్యం పరిశ్రమ నుంచే వెలువడే కాలుష్యం, దుర్వాసనతో శ్వాసకోశ, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, వాటిని నియంత్రించాలని పరిశ్రమ యాజమాన్యానికి గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ.. ముప్పిరెడ్డిపల్లి శివారులోని కిసాన్ ఇండ్రస్ట్రీస్ పరిశ్రమ నుంచి నిత్యం తమ గ్రామానికి దుర్వాసనతో కూడిన కాలుష్యం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోకపోతే పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

అర్హులకు జీరో బిల్లులు

విద్యుత్ శాఖ ఏడీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్



నర్సాపూర్: జీరో బిల్లులను వినియోగదారులకు అందిస్తున్న ఏడీఈ, ఏఈ ఇతర సిబ్బంది

నర్సాపూర్: ప్రభుత్వం నివాస గృహాలకు ఇవ్వనున్న గృహజ్యోతి ఉచిత కరెంట్ పథకం కింద పట్టణంలో అర్హులకు జీరో బిల్లులు అందజేస్తామని విద్యుత్ శాఖ ఏడీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో జీరో బిల్లులు చెల్లించే పనులు తమ సిబ్బంది చేపట్టారని తెలిపారు. జీరో బిల్లులు రాని వారు ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయంలో తమ ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రేషన్ కార్డు జిరాక్సులు అందించాలని, ఆయా కార్యాలయంలో అందజేసే రసీదును తమ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

కౌడిపల్లిలో గృహజ్యోతి ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులు అందజేశామని ట్రాన్స్‌కో ఏఈఈ సాయికుమార్ అన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుంటుందని మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ బిల్లులను అందజేశారు.



కొల్చారంలో..

కార్యక్రమంలో నాయకులు శేఖర్, మండల ఉపాధ్యక్షుడు గోవర్దన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

130 మందికి జీరో బిల్..



రేగోడ్(మెదక్): కొండాపూర్‌లో..

రేగోడ్(మెదక్): మండలంలోని కొండాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఏఈ యాసిన్, లైన్‌మన్ నాగరాజు 130 మందికి లబ్ధిదారులకు జీరో బిల్ అందజేశారు.

వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం

పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు 5వ తేదీ లోగా చెల్లించకుంటే విధులను బహిష్కరిస్తామని పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు పని చేస్తే వారికి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతికేదని, వారికి వచ్చే అరకొర జీతాలు, ఆర్థిక సమస్యలతోనే తమ జీవనాన్ని సాగిస్తున్నారని, ఇప్పటికైనా వారి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే శివరాత్రికి ఏడుపాయల విధులకు సైతం వెళ్లమన్నారు. 6 నుంచి గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరేష్, కార్మికులు ఆంజనేయులు, రాములు, శ్రీకాంత్, బాలమణి, ఎల్లమ్మ, నవనీత, పుష్ప తదితరులున్నారు.



వినతిపత్రాన్ని అందిస్తున్న పంచాయతీ కార్మికులు

నల్లపోచమ్మ ఆలయంలో కొబ్బరికాయల టెండర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద ఈ నెల 6న కొబ్బరికాయల టెండర్ నిర్వహించనున్నట్లు ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెండర్లు వేసే వారు రూ. 5 లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. అదేవిధంగా టెండర్ పాటదారుడు పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్, చెక్‌బుక్, ఫోన్‌నెంబర్, ప్రభుత్వ ఉద్యోగి షూరిటీ తప్పనిసరి అన్నారు. ఈ టెండర్ ఏడాది పాటు కొనసాగుతుందన్నారు. కాగా ఇటీవల టెండర్లు నిర్వహించగా, తునికి తండాకు చెందిన శ్రీను టెండర్ పొందినప్పటికీ, ముందుకు రాలేదన్నారు. దాంతో అతని టెండర్ రద్దు చేయడంతో పాటు అతను కట్టిన దరావత్తు రూ.లక్ష దేవస్థానం ఆదీనంలోకి వెళ్లాయన్నారు. దీంతో పాటు జాతర సందర్భంగా ఆలయం వద్ద పూల అలంకరణ, లైటింగ్ ఏర్పాటు కోసం కోటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులకు డీఎస్సీ వరం

నర్సాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ ప్రకటించడంతో నిరుద్యోగులకు మేలు జరుగుతుందని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సందీప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, నరసింహచారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూడాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సీఈఓ వచ్చిన విషయం తెలుసుకున్న ఎంపీపీ వినోదరెడ్డి కార్యాలయానికి వచ్చి, సిబ్బందితో కలిసి జెడ్పీ సీఈఓ ఎల్లయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారుల పాలనలో అధికారులు, కార్యదర్శులు గ్రామాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రంగచారి శర్మ, ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి, ఈసీ భగవాన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్పీ సీఈఓ ఎల్లయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ వినోదరెడ్డి

పల్స్‌పోలియోపై అవగాహన



పెద్దశంకరంపేటలో పోలియోపై అవగాహన ర్యాలీ



శివ్వంపేటలో సిబ్బంది సమీక్ష



కౌడిపల్లిలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి, రాజ్‌పేట గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. ఆదివారం 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలీయో చుక్కలు వేయించాలని అన్నారు.

ఏర్పాట్లు పూర్తి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ఆదివారం పల్స్‌పోలియో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పీహెచ్‌సీ, అంగన్‌వాడీ టీచర్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 0.5 సంవత్సరాలలోపు 4110 మంది చిన్నారులు ఉన్నారని వారందరికి పోలియో చుక్కలు వేసేందుకు 30 కేంద్రాల ఏర్పాటుతో పాటు 1 ట్రాన్సిటర్, 1 మొబైల్ టీం లు ఏర్పాటు చేసినట్లు వైద్యురాలు చెప్పారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యురాలు వేదశ్రీ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని వివరించారు. ఆయా కాలనీలు, గ్రామాల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, సాయిలు, రామ్మోహన్, పాల్, కమల, మౌనిక, వెంకటేశం ఉన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం మాఫీ



బ్యానర్‌ను ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మధుసూదన్, సిబ్బంది

నర్సాపూర్: ప్రభుత్వం ఇంటి పన్ను వడ్డీపై 90శాతం మాఫీ ప్రకటించిందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైత్ రాం నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని వారిపై వడ్డీ విధిస్తారన్నారు. బకాయిదారులకు విధించిన వడ్డీపై 90శాతం మాఫీని ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. వడ్డీపై 90శాతం మాఫీ పోను మిగిలిన పది శాతం వడ్డీతో కలిపి పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం నెల 31 వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. కాగా బకాయి పడి వంద శాతం వడ్డీతో ఇప్పటికే పన్నులు చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో అడ్వాన్స్ రూపంలో ఎక్కువ చెల్లించిన సొమ్మును సర్దుబాటు చేస్తారని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా పట్టణ ప్రజలకు వడ్డీ రాయితీపై అవగాహన కల్పించేందుకు పట్టణంలో కూడళ్ల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు మైకుల ద్వారా ప్రచారం చేస్తామని వివరించారు.

మొక్కల రక్షణకు చర్యలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సరీ మొక్కల రక్షణకు చర్యలు చేపట్టామని చిట్కుల్, జగ్గంపేట గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరిగిందని, నర్సరీ మొక్కలు ఎదుగుతున్న దశలో ఎండ వేడికి వాడిపోకుండా షేడ్‌నెట్ ఏర్పాటు చేశామన్నారు. దాంతో ఎండ వేడి మొక్కలకు ఎక్కువగా తగలకుండా ఉంటుందన్నారు. వచ్చే వర్షకాలం సమయానికి మొక్కలు నాటేలా సిద్ధం చేస్తామని వారు తెలిపారు.



జగ్గంపేట నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



శివ్వంపేట(నర్సాపూర్): దంతన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): నర్సింగరావుపల్లి పాఠశాలలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దంతన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయురాలు కవిత, నాయకులు నాగేశ్వర్ రావు, దుర్గేశ్, రమేశ్ బహుమతులు అందజేశారు.

నర్సింగరావుపల్లి పాఠశాలలో ..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నర్సింగరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. డీఈఓగా అనిల్, ఎంఈఓగా దీక్షిత, హెచ్ఎంగా అర్చన, ఉపాధ్యాయులుగా కార్తీక్, బబ్లు, వ్యవహరించారు. కుర్తివాడ కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్‌రావు, భట్టు నాగరాజు, శైలజ, టీచర్లు చిరంజీవి, పోషకులు పాల్గొన్నారు.

కాద్లూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ ప్రాథమికోన్నత స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం షహీన్ సుల్తాన, ఉపాధ్యాయులు అనిల్, విజయ సారథి, దుర్గాప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టీ.మాందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు.

కొప్పోల్ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో జాతరకు పోలీసు బందోబస్తు, క్యూలైన్, అన్నదానం, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పార్కింగ్ తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య, ఆలయ కమిటీ చైర్మన్ బాపురాజు, సభ్యులు రాజశేఖరరెడ్డి, సీతారం, ప్రభాకర్‌రావు, పరమేశ్వర్ రెడ్డి, శంకరయ్య, సంగమేశ్వర్, సతీష్‌గౌడ్, పూజారి సంగప్ప తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు

కొల్చారం(నర్సాపూర్): ప్రజాపాలనకు సంబంధించి గతంలో దరఖాస్తులు అందజేయని వారి సౌకర్యార్థం, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పాలన సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ద్వారా ప్రకటించిన పథకాలను పొందాలనుకునేవారు సేవా కేంద్రానికి వచ్చి నేరుగా తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందని కార్యాలయ సిబ్బంది తెలియ చేశారు.



సేవా కేంద్రంలో సిబ్బంది

'మంజీరా'లో గ్రాడ్యుయేషన్ డే

రామాయంపేట(మెదక్): మంజీరా విద్యాలయంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తిచేసుకొని ప్రైమరీ క్లాసుకు వెళ్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ మాస్టర్ రాజేశ్వరి మాట్లాడారు. ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వాసవి, ప్రసన్న, సుధాకర్, స్వాతి, భావన, అమూల్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం



రామాయంపేట(మెదక్): మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద రాచపల్లి లక్ష్మి కూతురు పెళ్లికి మైనంపల్లి హన్మంతరావు ఆదేశాలతో పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి శనివారం వారికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు, ఎంఎస్ఎస్ఓ సభ్యులు పాల్గొన్నారు.

◆ అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడిగా సురేశ్

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ అంబేడ్కర్ సంఘం చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడిగా గడ్డం సురేశ్‌ను ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రామ్‌చంద్రం ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా పవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భిక్షపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు డీలర్ నర్సింలు, స్వామి, మురళి, శ్రీనివాస్, నాంపల్లి, సుధాకర్, పాండు, నర్సింహులు, లక్ష్మణ్ ఉన్నారు.

◆ గృహజ్యోతి పాఠశాలలకు వర్తింపజేయాలి

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం పాఠశాలలకు వర్తింపజేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ విద్యతో పాటు ఇతర అవసరాల కోసం పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. సమావేశంలో తపస్ సంఘం నాయకులు రేఖ, చక్రవర్తి, అంజనేయులు, కృష్ణ, శంకర్, రజిత, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీలోకి రావడంపై హర్షం



నర్సాపూర్: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలోకి రావడం హర్షణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ చెప్పారు. శనివారం బీబీ పాటిల్‌ను పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌తో కలిసి సన్మానించారు.

◆ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం నార్సింగి మండల కేంద్రంలో రాజేందర్‌రెడ్డితో పాటు రెండు వందల మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నార్సింగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, డీసీసీ ఈరప్ప యాదగిరి, సుధాకర్ పాల్గొన్నారు.

◆ టిప్పర్లు పట్టివేత

తూప్రాన్: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ లక్ష్మి శనివారం తెలిపారు. పట్టణ సమీపంలో నాగులపల్లి చౌరస్తా వద్ద రాత్రి వేళ అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను తమ సిబ్బందితో పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు.

◆ రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ

తూప్రాన్: రోడ్డు భద్రతపై జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డుకాటి బైక్ ఓనర్స్ క్లబ్ సభ్యులు శనివారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఎంజేపీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రిని అందచేశారు. డుకాటి క్లబ్ ప్రతినిధి స్వెన్, జీఎమ్మార్ హైవే ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట రమణ, సిబ్బంది, ఫౌండేషన్ ప్రతినిధులు ,రక్ష సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

◆ ప్రణాళికతో చదవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి మండల విద్యాధికారి బుచ్యానాయక్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్, చండూర్ ఉన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి విఠల్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు వేదశ్రీ, హరిసింగ్ పాల్గొన్నారు.

◆ దొంగ అరెస్టు

తూప్రాన్: పట్టణ కేంద్రంలో వాహనం నుంచి బ్యాటరీ చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివానందం శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన దుర్గం నాగేశ్‌కు చెందిన వాహనం నుంచి బ్యాటరీ చోరీకి పాల్పడిన వెల్దుర్తి మండలం బొమ్మారంకు చెందిన భాస్కర్‌ను గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.